భట్టి నియోజకవర్గంలోనే హత్యలు

- సామినేని హంతకులను కాపాడే రీతిలో విచారణ
- న్యాయబద్ధ విచారణ సాగకపోతే పోలీసు కార్యాలయాల ముట్టడి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని, నున్నా
- రామారావు హత్య కేసు విచారణలో జాప్యానికి నిరసనగా ఖమ్మంలో సిపిఎం ప్రదర్శన



నిరసన దర్శన నిర్వహిస్తున్న సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏ నియోజకవర్గంలో లేని హత్యల పరంపర కేవలం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిరలోనే ఎందుకు కొనసాగుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, చింతకాని మండలం పాతర్లపాడుకు చెందిన సిపిఎం నాయకులు సామినేని రామారావు హత్య జరిగి ఐదురోజులు అవుతున్నా నిందితులను తేల్చటంలో పోలీసుశాఖ, సిపి నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హంతకులను కాపాడే రీతిలో విచారణ సాగుతోందని ఆరోపించారు. నిందితులను వదిలి బాధితులను ఇబ్బంది పెట్టే రీతిలో ఎంక్వయిరీ ఉందన్నారు. రాజ్యాంగ బద్ధంగా, న్యాయబద్ధంగా విచారణ సాగకపోతే పోలీసు కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. రామారావు హత్యకేసు విచారణ సాగుతున్న తీరుకు నిరసనగా సిపిఎం ఖమ్మం డివిజన్ కమిటీ, ఖమ్మం రూరల్ మండల కమిటీల ఆధ్వర్యంలో నగరంలో మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక పాతబస్టాండ్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ వైరా రోడ్డు మీదుగా జడ్పీ సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేశ్‌తో కలిసి పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడారు.

మధిర నియోజకవర్గంలో కొనసాగుతున్న హత్యల పరంపరలో భాగంగా కాంగ్రెస్ గూండాలు కుట్ర పన్ని రామారావును హత్యచేశారన్నారు. ఈ హత్య జరిగి ఇప్పటికీ ఐదురోజులు అవుతోందని, ఘటన చోటుచేసుకోగానే పోలీసు క్లూస్ టీంలు, డాగ్ స్క్వాడ్‌లు వచ్చాయని, సిపి సునీల్‌దత్ వచ్చి కేసును వెంటనే ఛేదిస్తామని చెప్పారని తెలిపారు. కానీ ఈ కేసు విషయంలో పోలీసుశాఖ వ్యవహరిస్తున్న తీరు అత్యంత దుర్మార్గంగా ఉందని విమర్శించారు. 'నిందితులు పలానా వాళ్లు.. వాళ్లను పట్టుకుని శిక్షించండి' అని రామారావు భార్య స్వరాజ్యం స్వయంగా పిటిషన్ ఇచ్చారని గుర్తుచేశారు. రామారావు భార్య నిందితులు ఎవరని పేర్కొన్నారో.. వారందరూ గ్రామంలోనే ఉన్నా పోలీసు విచారణ మాత్రం రామారావు కుటుంబంపై సాగుతోందని అన్నారు. విచారణను కాలేజీలు, స్కూళ్లు, ప్రిన్సిపళ్లు, బంధువులు, రామారావు కుటుంబానికి ఎందుకు పరిమితం చేస్తున్నారని పోలీసులను ప్రశ్నించారు. నేరస్తులను పట్టుకోవాలనే రీతిలో పోలీసులు విచారణ చేయడం లేదని, వారిని కాపాడే పద్ధతిలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భట్టి ఎప్పుడైతే ప్రధాన పదవుల్లోకి వస్తారో.. అప్పుడు మధిర నియోజకవర్గంలో కాంగ్రెస్ గూండాలు ప్రజా నాయకులను చంపివేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నారని అన్నారు. పందిళ్లపల్లిలో అలవాల శ్రీనివాస్, గోవిందాపురం(ఎల్)లో ఎర్రబోయిన నాగేశ్వరరావు, ఇప్పుడు పాతర్లపాడులో సామినేని రామారావును అలాగే చంపివేశారన్నారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరుకు.. జరుగుతున్న హత్యలకు.. భట్టి విక్రమార్క అధికారంలోకి రావడానికి మధ్య విడదీయరాని బంధం ఉందన్నారు. సిపి సునీల్‌దత్ దీన్ని రాజకీయ హత్యగా పరిగణించడానికే సుముఖంగా లేరన్నారు. రాజకీయ హత్యగా పేర్కొనాలని ఎవరన్నా అంటే.. వారిని ముద్దాయిగా చేస్తామని సిపి హెచ్చరిస్తున్న తీరు అభ్యంతరకరం అని తెలిపారు. పోలీసులు ఇలాగే విచారిస్తే 'ప్రజలే విచారిస్తారు.. వారే దోషులను తేల్చుతారు.. శిక్షిస్తారు.. జాగ్రత్త' అని హెచ్చరించారు.

దొంగలకు సద్దులు మోసే పద్ధతిలో విచారణ

దొంగలకు సద్దులు మోసే పద్ధతిలో విచారణ సాగుతోందని పోతినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయమైన, రాజ్యాంగ పద్ధతిలో విచారణ చేస్తే సరేసరి.. లేదంటే సిపిఎం సహించదని హెచ్చరించారు. "భట్టి విక్రమార్కను హెచ్చరిస్తున్నాం. మీరు ఉపముఖ్యమంత్రి అయిన తర్వాత మధిర నియోజకవర్గంలోనే హత్యలు ఎందుకు జరుగుతున్నాయో సమాధానం చెప్పాలి?. మాకు సారున్నారు.. మాకు మేడం ఉన్నారు.. ఏమి చేసినా సార్, మేడం చూసుకుంటారని నేరస్తులు స్పష్టంగా చెబుతున్నారు.. అట్లాగే చూసుకుంటారా? హత్యలు, రౌడీయిజం, గూండాయిజం, అన్యాయం చేసినవాళ్లను ఇలాగే చూసుకుంటామంటే చెప్పండి.. అప్పుడు ఎలా చూసుకోవాలో మేము కూడా చూసుకుంటాం.. రాజ్యాంగబద్ధమైన పద్ధతుల్లో ఉండాలి తప్ప, చూసుకోవాలనే పద్ధతుల్లో మేము లేము.. చూసుకోవాల్సి వస్తే మాకూ చేతనవుతుంది.. ఎట్లా చూసుకోవాలో.. చూసుకోవడానికి సిద్ధపడే పద్ధతిలో మేము లేం.. కానీ అదే తప్పనిసరైతే తప్పక చూసుకుంటాం.." అని పోతినేని హెచ్చరించారు. పోలీసు యంత్రాంగం వెంటనే అప్రమత్తమై చర్యలు తీసుకోకపోతే ఇది ఇక్కడికే పరిమితం కాదన్నారు. మొత్తం పోలీసు కార్యాలయాలను ముట్టడిస్తామని అన్నారు. దోషులను తేల్చి.. నిర్ధారించి శిక్ష వేసే వరకూ ఆందోళనలు కొనసాగుతాయని హెచ్చరించారు.

అధికార పార్టీ హంతకులను తప్పించే యత్నం: నున్నా నాగేశ్వరరావు

అధికార పార్టీకి చెందిన హంతకులను కేసు నుంచి తప్పించే ప్రయత్నం జరుగుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఈ హత్యకు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. హత్యలను ఆపు చేయించకపోతే మూల్యం తప్పదన్నారు. విచారణ ప్రారంభం కాకముందే రాజకీయ హత్య కాదని సిపి ఎలా అంటారని ప్రశ్నించారు. హత్య, మాఫియా రాజకీయాలను ఖండించాలని పిలుపునిచ్చారు. హంతకులను పట్టుకునే దాకా సిపిఎం నిద్రపోదని స్పష్టంచేశారు. ఉద్యమాలతోనే సమాధానం చెబుతామన్నారు. హత్యా నిందితులు తమ పక్కనే ఎందుకు తిరుగుతున్నారని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేశ్ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి పద్మ, వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, ఖానాపురం హవేలీ, రఘునాథపాలెం, ఖమ్మం రూరల్ మండలాల కార్యదర్శులు నాగుల్‌మీరా, బోడపట్ల సుదర్శన్, భూక్యా శ్రీనివాసరావు, దొంగల తిరుపతిరావు, ఎస్.నవీన్‌రెడ్డి, ఊరడి సుదర్శన్‌రెడ్డి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మీరాసాహెబ్, నంద్ర ప్రసాద్, మెరుగు సత్యనారాయణ, మెరుగు రమణ, బండారు రమేశ్, ఎంఏ జబ్బార్, తుమ్మా విష్ణు తదితరులు పాల్గొన్నారు

సిఎం ప్రజావాణికి 238 దరఖాస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 238 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 51, రెవెన్యూ శాఖకు సంబంధించి 46, మున్సిపల్ శాఖకు 23, ఇందిరమ్మ ఇండ్ల కోసం 67, ప్రవాసి ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 49 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి జి.చిన్నారెడ్డి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

జిఎస్‌టి ప్రయోజనాలు బదిలీ : ఐసిఐసిఐ ప్రూ లైఫ్

ముంబయి : తమ ఖాతాదారులకు బీమాను చౌకగా మార్చడానికి జిఎస్‌టి ప్రయోజనాలను బదిలీ చేసినట్లు ఐసిఐసిఐ ప్రూ లైఫ్ తెలిపింది. ఇటీవల కేంద్రం ప్రభుత్వం అన్ని బీమా పాలసీలను జిఎస్టి నుండి మినహాయించే సంస్కరణలను ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేసింది. వినియోగదారులు గతంలో ప్రీమియం మొత్తంలో 18 శాతం జిఎస్‌టి చెల్లించాల్సి వచ్చేది. జిఎస్టి మినహాయింపుతో వ్యక్తి ఇప్పుడు రూ.100 మాత్రమే చెల్లించడం ద్వారా.. ఇది టర్మ్ ఇన్సూరెన్స్ ఉత్పత్తులతో సహా జీవిత బీమా ఉత్పత్తులను చౌకగా మార్చిందని ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కో లిమిటెడ్ చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ వికాస్ గుప్తా పేర్కొన్నారు.

అమృతాంజన్ నుంచి మళ్లీ పసుపు బామ్ విడుదల

హైదరాబాద్ : అమృతాంజన్ మళ్లీ తన పసుపు బామును విడుదల చేసినట్లు అమృతాంజన్ హెల్త్‌కేర్ తెలిపింది. ఈ చిన్న ఉపశమనపు డబ్బా అపురూపమైన జ్ఞాపకాలను అందించనుందని పేర్కొంది. 1893లో అమృతాంజన్‌ను కాశీనాథుని నాగేశ్వర రావు ప్రారంభించారు. పసుపు బామును కొత్త క్లాసిక్ గాజు సీసాలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొంది.

అజహరుద్దీన్‌కు శాఖల కేటాయింపు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అజహరుద్దీన్‌కు మైనారిటీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖలను కేటాయించారు. గతనెల 31న రాష్ట్రమంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మైనారిటీ సంక్షేమశాఖ బాధ్యతలను నిర్వహిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ శాఖలు కేటాయించారు.

మిలిటెంట్ పోరాటాలకు సన్నద్ధం

- రిజర్వేషన్లు అమలు చేస్తేనే ప్రయివేట్ పరిశ్రమలకు అనుమతి
- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామీణ ధనిక వర్గ దోపిడీకి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా మిలిటెంట్ పోరాటాలకు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయూ) సన్నద్ధమవుతోందని ఆ సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్ తెలిపారు. సోమ, మంగళవారాల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర విద్యా వైజ్ఞానిక తరగతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. నిరుపేదలకు భూములపై హక్కు, గృహ వసతి కల్పన, కనీస వేతనాలు, ఉపాధి కల్పన, మెరుగైన విద్య, వైద్యం సౌకర్యాలు కల్పించడం ద్వారానే కేరళలోని పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పేదరిక నిర్మూలన చేసిందని తెలిపారు. దేశవ్యాప్తంగా కేరళ మోడల్‌ను అమలు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ శ్రామిక ప్రజలను నయా భూస్వామ్య ధనిక వర్గం చేస్తున్న శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన, పోరాటాలను మిలిటెంట్‌గా నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామీణ శ్రామికులందరినీ ఐక్యం చేయడం కోసమే సంఘ నిర్మాణంలో మార్పులను చేస్తున్నామని తెలిపారు. పని కోసం ఇతర ప్రాంతాలకు కార్మికుల వలసలు, అతి పేదరికం, నిరుద్యోగం, ఆకలి చావులు , వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యలు రూపుమాపాలంటే కేరళ మోడల్ మాత్రమే ప్రత్యామ్నాయం చూపగలదని స్పష్టం చేశారు. పేదల నివాసానికి 60 గజాల ఇండ్ల స్థలం ఇవ్వడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధపడటం లేదనీ, కార్పొరేట్ బహుళ జాతి కంపెనీలకు మాత్రం వేలాది ఎకరాలను బలవంతంగా సేకరించి ప్రభుత్వాలు కట్టబెడుతున్నాయని విమర్శించారు. అదాని, అంబానిలకు భూములను అప్పజెప్పడం కోసమే అడవుల్లో ఆదివాసీలపై దాడులు చేస్తున్నారనీ, బలవంతంగా అడవి నుండి గెంటేస్తున్నారని వివరించారు. ఈ ఘటనలకు వ్యతిరేకంగా ప్రతిఘటన పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విలువైన భూములతో పాటు కోట్ల రూపాయల రాయితీలను కార్పొరేట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిస్తున్నాయని తెలిపారు. అయినా ఆ ప్రయివేటు కంపెనీల్లో ఎక్కడా సామాజిక రిజర్వేషన్లను అమలు చేయడం లేదని ఆరోపించారు. రిజర్వేషన్లు అమలు చేసే పరిశ్రమలకు మాత్రమే ప్రభుత్వాలు భూములు ఇతర రాయితీలనివ్వాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా నిత్యావసర ధరలు పెరుగుతుంటే వాటిని అరికట్టటంలో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు. పెరిగిన ధరలకనుగుణంగా వ్యవసాయ రంగంలో కనీస వేతనాలను పెంచడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తేసేందుకు కుట్ర చేస్తోందనీ, దాని రక్షణ కోసం పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, కేంద్ర కమిటీ సభ్యులు బి ప్రసాద్, బి పద్మ, పొన్నం వెంకటేశ్వరరావు, నారీ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి తడిసిన పత్తి, మొక్కజొన్న

- తాజా వర్షంతో మరోసారి ముంపు భయం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గతవారం కురిసిన మొంథా తుఫాన్ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజలకు మంగళవారం కురిసిన కుండపోత వర్షంతో మరోసారి ముంపు భయం పట్టుకుంది. అకాల వర్షానికి వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పత్తి, మొక్కజొన్న పంటలు తడిసి ముద్దయ్యాయి. మంగళవారం ఉదయం ఒక్కసారిగా మారిన వాతావరణంతో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అరగంట పాటు కురిసిన ఈ కుండపోత వర్షానికి మార్కెట్‌లో ఆరబోసిన మక్కలు నీటిలో కొట్టుకుపోయాయి. మార్కెట్ అధికారులు సకాలంలో పరదాలు ఇవ్వకపోవడం వల్లనే తమ ధాన్యం తడిసిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్టోబర్ 27న ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మంత్రి కొండ సురేఖ చేతుల మీదుగా సిసిఐ, మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలు మాత్రం కొనుగోలు చేయడం లేదు. సిసిఐ కూడా నామమాత్రంగా కేవలం 2771 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేశారు. ఎనుమాముల మార్కెట్‌కు మంగళవారం మొత్తం పత్తి 5000 బస్తాలు రాగా మార్కెట్ అధికారులు సకాలంలో పరదాలు ఇవ్వకపోవడం వల్ల సుమారు 2000 బస్తాలు తడిసిపోయాయి. అక్టోబర్ మొదటి వారం నుంచి ఇప్పటివరకు కొత్త పత్తి మొత్తం 57,863 క్వింటాళ్లు రాగా గరిష్టంగా ధర రూ. 6920, కనిష్ట ధర రూ.5,000 పలకగా మోడల్ ధర రూ.6300 పలికింది.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
కౌసల్య, ఎర్రగుంట తండా, పాలకుర్తి, జనగామ

70 బస్తాల మక్కలను గత శనివారం మార్కెట్‌కు తీసుకువచ్చాను. నాలుగు రోజులుగా మార్కెట్‌లోనే మక్కలను ఆరబెట్టుకుంటున్నాను. ప్రయివేట్ వ్యాపారులు తేమశాతం ఎక్కువగా ఉందని కొనుగోలు చేస్తలేరు. ఇప్పుడు కురిసిన వర్షం వల్ల మక్కలు నీటిలో కొట్టుకుపోయాయి. తడిసిన మక్కలను ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలి.

సకాలంలో పరదాలు ఇయ్యలే కావత్ : సొమ్లు, బమ్మెర, పాలకుర్తి జనగామ

మూడు రోజుల క్రితం 30 బస్తాల మక్కలు తీసుకువచ్చాను. మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి మొత్తం తడిశాయి. అధికారులు సకాలంలో పరదాలు ఇవ్వకపోవడం వల్లనే పంట మొత్తం తడిసి వర్షంలో కొట్టుకుపోయింది. అధికారులు తేమ 14శాతం లోపు ఉంటేనే కొనుగోలు చేస్తామని చెబుతున్నారు.

ఈసారి పెట్టుబడులు వచ్చుడు కష్టమే : శ్రీశైలం, మనుగొండ, గీసుగొండ వరంగల్

మార్కెట్‌కు 18 బస్తాల పత్తి తీసుకువచ్చాను. ధర రూ.6700 పలికింది. ఎకరానికి 10 క్వింటాళ్లు రావలసిన పత్తి.. ఈ ఏడాది 4-5 క్వింటాళ్లు వచ్చుడే కష్టంగా ఉంది. ఒక్కో కూలీకి రూ.400 ఇచ్చి పత్తి ఏరిచ్చిన. ఏరిన కూలీ వచ్చినా చాలు అనుకుంటున్నాం.

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ

- స్పీకర్ కార్యాలయం షెడ్యూల్ ప్రకటన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ దాఖలు చేసిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణకు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 6, 7, 12, 13 తేదీల్లో విచారణ చేపట్టనున్నారు. తొలుత పిటిషనర్లు, అనంతరం ప్రతివాదులను క్రాస్ ఎగ్జామిషన్ చేస్తారు. రోజుకు ఇద్దరిని విచారిస్తారు. ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ వేసిన పిటిషన్ నేపథ్యంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెల్లం వెంకట్రావు, అరికెపూడి గాంధీపై దాఖలైన పిటిషన్లపై తదుపరి విచారణ జరగనుంది. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు ఇప్పటికే ముగిసిన నేపథ్యంలో మరోసారి పెంచాలని స్పీకర్ విజ్ఞప్తి చేశారు. మొత్తం ప్రక్రియను పూర్తిచేసేందుకే స్పీకర్ షెడ్యూల్ ఇచ్చినట్టు అసెంబ్లీ అధికార వర్గాలు తెలిపాయి.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంపై అధ్యయనానికి కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం సజావుగా అమలు చేసేందుకు వీలుగా అధ్యయనానికి కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు సీఎస్ కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి సంక్షేమశాఖ ప్రత్యేక సిఎస్ ఛైర్మన్‌గా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి వైస్ ఛైర్మన్‌గా, ఎస్‌సి అభివృద్ధి శాఖ కమిషనర్‌గా ఉన్నారు. సభ్యులుగా విద్య, ఎస్‌సి అభివృద్ధి, బిసి సంక్షేమం, ఎస్‌టి సంక్షేమ శాఖల కార్యదర్శులు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్, ప్రొఫెసర్ కంచ ఐలయ్యతో పాటు ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య నుంచి ముగ్గురు ప్రతినిధులు కమిటీలు ఉన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పాలసీపై కమిటీ ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనుంది. నిర్మాణాత్మకంగా, పారదర్శకంగా, సుస్థిరంగా హేతుబద్ధంగా ఉండే ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానానికి అవసరమైన సూచనలను కమిటీ చేయనున్నది. అక్టోబర్ 28న కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మావోయిస్టుల భారీ డంపు గుర్తింపు

- 17 రైఫిళ్లు, నిర్మాణ సామగ్రి స్వాధీనం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా భద్రతా దళాలు గోమ్‌గూడ దట్టమైన అటవీ ప్రాంతంలో మావోయిస్టుల ఆయుధ కర్మాగారాన్ని కనుగొని ధ్వంసం చేసినట్టు సుకుమా జిల్లా ఎస్‌పి కిరణ్ చౌహాన్ తెలిపారు. డిఆర్‌జి బృందం ఈ ఆపరేషన్‌లో ప్రత్యేక పాత్ర పోషించిందని తెలిపారు. మంగళవారం ఎస్‌పి కిరణ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. సుక్మా జిల్లా డిఆర్‌జి బృందం, నిర్దిష్ట నిఘా సమాచారం మేరకు.. గోమ్‌గూడ దట్టమైన అటవీ ప్రాంతంలో మావోయిస్టులు నిర్వహిస్తున్న అక్రమ ఆయుధ తయారీ కర్మాగారాన్ని కనుగొని ధ్వంసం చేసినట్టు తెలిపారు. 17 రైఫిల్స్, ఆయుధాల తయారీ పరికరాలు, యంత్రాలు, తుపాకీ భాగాలు, పెద్ద మొత్తంలో ఆయుధాల తయారీ సామగ్రిని సంఘటనా స్థలం నుంచి స్వాధీనం చేసుకున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో సాయుధ కార్యకలాపాలను పెంచే లక్ష్యంతో మావోయిస్టులు ఈ కర్మాగారాన్ని నిర్వహిస్తున్నారని ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. గత సంవత్సరంలో 545 మంది మావోయిస్టులు లొంగిపోయి ప్రధాన స్రవంతిలో చేరారని, 454 మంది మావోయిస్టులు అరెస్టు అయ్యారని, సుమారు 64 మంది వివిధ ఎన్‌కౌంటర్లలో మరణించారని తెలిపారు. లొంగిపోయిన ప్రతి మావోయిస్టుకు పూర్తి భద్రత, గౌరవం ఇవ్వబడుతుందని తెలిపారు.

డెంటల్ డాక్టర్, వ్యాపారిపై 'నిర్భయ' కేసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ వివాహితను లైంగిక వేధింపులకు గురిచేసిన ఘటనలో డెంటల్ డాక్టర్ కొండ అమర్, రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆయిల్ గంగాధర్‌పై లైంగిక వేధింపులు, నిర్భయ కేసు నమోదైనట్టు నిజామాబాద్ 4వ టౌన్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నగరంలో నివాసముండే ఓ యువతి 2021 సంవత్సరంలో ప్రగతినగర్‌లోని ఓ ట్రావెల్స్ ఏజెన్సీలో పనిచేశారు. ఆ సమయంలో విదేశాలకు వెళ్లేందుకు డెంటల్ డాక్టర్ అమర్ పాస్‌పోర్ట్ కావాలంటూ ట్రావెల్స్ ఏజెన్సీకి వచ్చి సదరు యువతి సెల్‌ఫోన్ నెంబర్ తీసుకున్నాడు. అనంతరం ఆ యువతికి పలుసార్లు ఫోన్ చేస్తూ, అసభ్యంగా మాట్లాడటం, తాము చెప్పిన చోటుకు వస్తే కావాల్సినంత డబ్బులు ఇస్తామని వేధింపులకు గురిచేసినట్టు బాధితురాలు వాపోయారు. అలాగే, నగరానికి చెందిన ఆయిల్ గంగాధర్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి సైతం ఇదేరకంగా వేధింపులకు పాల్పడినట్టు ఫిర్యాదు చేసింది. 'ఐదు వేలు ఇస్తాం.. పదివేలు ఇస్తాం వస్తావా..' అంటూ వాట్సప్‌కాల్ చేస్తూ వేధింపులకు పాల్పడ్డారని తెలిపారు.

ధరణ్ ఇన్‌ఫ్రా, స్కైమాక్స్ ఒప్పందం

హైదరాబాద్ : స్కైమాక్స్ ఇన్‌ఫ్రా పవర్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ధరణ్ ఇన్‌ఫ్రా-ఇపిసి లిమిటెడ్ తెలిపింది. స్కైమాక్స్ ఇన్‌ఫ్రా పవర్ లిమిటెడ్‌తో రూ.215 కోట్ల సరఫరా ఒప్పందంపై సంతకం చేసినట్లు పేర్కొంది. ఈ ఒప్పందం ప్రధానంగా 75 మెగావాట్ల అల్లే సోలార్ ప్రాజెక్ట్ డిజైన్, ఇంజనీరింగ్, సేకరణ, సరఫరా, సంస్థాపన, పరీక్ష, కమీషనింగ్‌ను కవర్ చేయనున్నట్లు వెల్లడించింది. ఈ ప్రాజెక్ట్ మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలోని తొమ్మిది ప్రదేశాలలో అభివద్ధి చేయబడుతుందని తెలిపింది.

ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ సేవల విస్తరణ

హైదరాబాద్ : నగరంలో తమ 10 నిమిషాల డెలివరీ సేవలను విస్తరించినట్లు ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ తెలిపింది. ప్యాకేజ్డ్ ఫుడ్, పర్సనల్ కేర్, మొబైల్స్, భారీ ఉపకరణాలు, ఎలక్ట్రానిక్స్ వంటి వాటితో పాటుగా రోజువారీ నిత్యావసర వస్తువులను 10 నిమిషాలలో డెలివరీ అందించనున్నట్లు పేర్కొంది. తమ సంస్థ వేలాది మంది రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలతో కలిసి పనిచేస్తుందని తెలిపింది. హైదరాబాద్‌లోని అధిక డిమాండ్ ఉన్న జోన్‌లకు సేవలందించడానికి వ్యూహాత్మకంగా ఏర్పాటు చేసిన ఎంఎఫ్‌సిలు విస్తృత శ్రేణి ఎంపికలను అందిస్తుందని ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ ప్రతినిధి హేమంత్ బద్రి పేర్కొన్నారు.

లక్ష ఇవి కార్లను విక్రయించిన ఎంజి మోటార్

గూర్‌గావ్ : ప్రముఖ కార్ల తయారీ కంపెనీ జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా దేశంలో 1,00,000 ఎలక్ట్రిక్ వాహనాల విక్రయ మైలురాయిని అధిగమించినట్లు ప్రకటించింది. స్వచ్ఛ, స్మార్ట్ మొబిలిటీ పరిష్కారాలను రూపకల్పన చేయడంలో ముందంజలో ఉన్నట్లు పేర్కొంది. ఇది కేవలం స్మార్ట్ ఉత్పత్తులను మాత్రమే కాకుండా, సమగ్ర ఎకోసిస్టమ్ ఆధారిత సాంకేతిక పరిష్కారాలను కూడా అందిస్తోన్నామని ఆ కంపెనీ ఎండి అనురాగ్ మెహ్రోత్రా పేర్కొన్నారు. ఇది భారత వినియోగదారులు సుస్థిర ఎంపికలపై చూపే నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం
- దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తాం : డిజిపి


ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న డిజిపి, అడిషనల్ డిజిపి తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని డిజిపి శివధర్‌రెడ్డి సూచించారు. మంగళవారం రంగారెడ్డి చేవెళ్ల మండలం మీర్జాగూడలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనా స్థలాన్ని డిజిపి సందర్శించారు. ఘటనకు గల కారణాలపై ఆరా తీశారు. ప్రమాద స్థలంలో మూల మలుపులు, గుంతలు, ఇతర కారణాలను పరిశీలించారు. అనంతరం ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడే సమయంలో గాయపడిన చేవెళ్ల సిఐతోపాటు పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగ్రాతులనూ ఆయన పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. బాధితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.. టిప్పర్ అతివేగంగా వచ్చి ఆర్‌టిసి బస్సును ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగిందన్నారు. దాదాపు 40 మీటర్లు లాక్కెళ్లడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని తెలిపారు. ఈ ప్రమాదంలో బస్సులో డ్రైవర్ సైడ్ కూర్చున్న వారు చాలా మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. రోడ్డు మలుపు ఉంది కానీ యాక్సిడెంట్ అయ్యేంత తీవ్ర మలుపు ఏమి లేదన్నారు. ప్రమాదం జరిగిన తీరు చూస్తే టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. పోలీసుల దర్యాప్తులో అన్ని విషయాలూ వెల్లడవుతాయని తెలిపారు. రోడ్డు ప్రమాదానికి గురైన టిప్పర్ కండిషన్ మెకానిక్ ద్వారా పరిశీలిస్తున్నామని చెప్పారు. టిప్పర్ లారీ ఓనర్ లక్ష్మణ్‌నాయక్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను ప్రభుత్వ పరంగా చూడకూడదని, ఇది అందరి బాధ్యతగా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాలు పెద్ద సమస్యగా మారిందని, చాలా మంది ప్రయాణికులు రోడ్డు ప్రమాదాల వల్ల మరణిస్తు న్నారని తెలిపారు. రోడ్డు మీద డ్రైవ్ చేసే వారు డిఫెన్స్ కండిషన్‌ను అంచనా వేసుకొని డ్రైవ్ చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలపై వచ్చే నెల నుంచి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. స్కూళ్లు, కాలేజీలు, కార్పొరేట్ సంస్థలతో సమన్వయం చేస్తూ డ్రైవర్లలో భద్రతా చైతన్యం పెంపొందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం చేవెళ్ల ప్రమాదంపై స్థానిక ఎసిపి ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతోందని, ఘటనకు కారణాలు త్వరలో వెల్లడిస్తామని వెల్లడించారు. ఆయన వెంట అడిషనల్ డిజిపి మహేష్ భగవత్, సిపి అవినాష్ మహంతి, ఎసిపి కిషన్, పోలీస్ సిబ్బంది, ఉన్నారు.

విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

- జనవరి 30న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ర్యాలీ
- నవంబర్ 15 నుంచి జనవరి 25 వరకు సంఘీభావ సమావేశాలు
- ఆల్‌ఇండియా పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ సవరణ బిల్లు 2025ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జనవరి 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు ఆల్‌ఇండియా పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్ (ఎఐపిఇఎఫ్) వెల్లడించింది. మంగళవారం ముంబైలో జరిగిన నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు ఎఐపిఇఎఫ్ అధ్యక్షులు శైలేంద్ర దూబె తెలిపారు. విద్యుత్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమాన్ని ప్రారంభించేందుకు రైతులు, వినియోగదారుల సంఘాలతో ఐక్య ఫ్రంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ర్యాలీకి సంఘీభావంగా నవంబర్ 15 నుంచి జనవరి 25 వరకు అన్ని రాష్ట్రాల్లో విద్యుత్ ఉద్యోగులు, రైతులు, వినియోగదారుల సమావేశాలు నిర్వహించనున్నట్టు వివరించారు. సవరణ బిల్లు 2025 ద్వారా కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రయివేటీకరించాలనే కుట్రకు పాల్పడుతోందని విమర్శించారు. బిల్లు పట్టాలెక్కితే విద్యుత్ ధరలు పెరిగి సామాన్య ప్రజలు, రైతులకు కష్టాలు తప్పవని హెచ్చరించారు. "ప్రయివేట్ కంపెనీలకు యూనివర్సల్ విద్యుత్ సరఫరా బాధ్యత ఉండదు. తమ లాభదాయకమైన పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేయడానికి ప్రభుత్వ సంస్థల నెట్‌వర్క్‌ను ఉపయోగిస్తాయి. రైతులు, గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసే బాధ్యత మాత్రం ప్రభుత్వ విద్యుత్ పంపిణీ సంస్థలదే అవుతుంది. ఫలితంగా అవి దివాళా తీయాల్సి వస్తుంది. విద్యుత్ కొనుగోలు చేయడానికి లేదా ఉద్యోగులకు జీతాలు చెల్లించడానికి కూడా ఇక్కట్లు తప్పవు. సవరణ బిల్లు సెక్షన్ 61లో మార్పులు చేయడం ద్వారా వచ్చే ఐదేండ్లలో క్రాస్-సబ్సిడీని తొలగించాలని ప్రతిపాదిస్తోంది. 6.5 హార్స్‌పవర్ మోటార్‌ను రోజుకు ఆరు గంటలు నడిపితే రైతులు నెలకు కనీసం రూ.12 వేల విద్యుత్ బిల్లు చెల్లించాల్సి వస్తుంది. పేదరిక రేఖకు దిగువన ఉన్న వినియోగదారులకు విద్యుత్ ధర యూనిట్‌కు కనీసం రూ.10 నుంచి 12 వరకు పెరుగుతుంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని సగటు విద్యుత్ వినియోగదారులు, రైతులకు గుదిబండగా మారనున్న సవరణ బిల్లును ఉపసంహరించుకునే వరకు ఉద్యమం ఆగదని హెచ్చరించారు. ఈ సమావేశంలో అఖిల భారత విద్యుత్ ఇంజనీర్ల సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి. రత్నాకర్ రావు, నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ ముఖ్య నాయకులు మోహన్ శర్మ, సుదీప్ దత్తా, కె. అశోక్ రావు, కృష్ణ భోయార్, లక్ష్మణ్ రాథోడ్, సంతోష్ ఖుమ్కర్, సంజయ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు. నేషనల్ కో -ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలంగాణ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ నాయకులు నలువాల స్వామి తెలిపారు.

నాలుగు రైళ్ల సర్వీసులు పెంపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో నాలుగు రైళ్లకు సంబంధించిన సర్వీసులు పెరిగాయి. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే సిపిఆర్ఒ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాందేడ్ నుంచి హడాస్పూర్(07607) ఈనెల 11 నుంచి 25 వరకు సర్వీసులు నడుస్తాయి. హడాస్పూర్ నుంచి నాందేడ్(07603) ఈనెల 11 నుంచి 25 వరకు సర్వీసులు నిర్వహిస్తారు.

ఈ రెండు రైళ్ల సేవలు ప్రతి మంగళవారం అందుబాటులో ఉంటాయి. భాగల్‌పూర్ నుంచి ఎస్ఎంబిటి బెంగళూరు (03403) ఈనెల ఏడున శుక్రవారం నడవనుంది. ఎర్నాకులం నుంచి బారౌని (06159) ఈనెల ఐదున బుధవారం నడుస్తుంది. ఈ నాలుగు రైళ్లకు సంబంధించి ప్రయాణికుల కోసం ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్టు సిపిఆర్ఒ తెలిపారు.

బాలికపై లైంగిక వేధింపులు

- డ్యాన్స్ మాస్టర్ అరెస్ట్... పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ డ్యాన్స్ మాస్టర్ నాలుగేళ్ల చిన్నారిని లైంగికంగా వేధించడంతోపాటు అసభ్యంగా ప్రవర్తించారు. దాంతో అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. పూర్తి వివరాల్లోకెళ్తే.. ఓల్డ్ బోయిన్‌పల్లిలో జ్ఞానేశ్వర్ కొన్నాళ్ల నుంచి డ్యాన్స్ స్టూడియో నిర్వహిస్తున్నాడు. రెండు నెలలుగా తన వద్ద డ్యాన్స్ నేర్చుకునేందుకు వస్తున్న బాలిక పట్ల స్టూడియోలో ఎవరూ లేనప్పుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. దాంతో కొన్నిరోజులుగా డ్యాన్స్ స్కూల్‌కు వెళ్లనంటున్న చిన్నారిని తల్లిదండ్రులు ప్రశ్నించగా.. అసలు విషయం బయటకు వచ్చింది. కొన్నిరోజులుగా జ్ఞానేశ్వర్ లైంగిక వేధింపులకు గురి చేయడంతోపాటు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్టు బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. దాంతో వారు బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోక్సో కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్టు ఉత్తర మండల డిసిపి రష్మీ పెరుమాళ్ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించడంతోపాటు స్టూడియోను మూసేసినట్టు చెప్పారు. పాఠశాలలోనే చిన్నారులకు మంచి, చెడు స్పర్శలపై అవగాహన కల్పించాలని, ఇలాంటి డ్యాన్స్ స్టూడియోలకు పంపే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు డిసిపి సూచించారు.

ఇన్నోవేషన్ హబ్‌గా హైదరాబాద్

- పెట్టుబడుల్లో జర్మనీ భాగస్వామ్యం కోరుకుంటున్నాం
- సిఎం రేవంత్‌తో జర్మనీ కాన్సుల్ జనరల్ భేటీ



జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్ బృందంవారితో సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మహా నగరాన్ని ఇన్నోవేషన్ హబ్‌గా తయారు చేసేందుకు జర్మనీ సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని, ఇందుకు ప్రజాప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలిచి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తుందని సిఎం తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్ బృందం భేటీ అయింది. డ్యుయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రికి వివరించారు. వచ్చే రెండేళ్లలో ఐటి రంగంలో వెయ్యి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నట్లు సిఎంకు వివరించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ పెట్టుబడుల విషయంలో తెలంగాణ జర్మనీ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందన్నారు. హైదరాబాద్‌లో జర్మనీ టీచర్లను నియమించి తెలంగాణ విద్యార్థులకు జర్మనీ భాషను నేర్పించేందుకు సహకరించాలని జర్మనీ కాన్సుల్ జనరల్‌ను సిఎం కోరారు. ఐటి, ఫార్మా, ఆటోమొబైల్ రంగంలో జర్మనీ కంపెనీలు పెట్టుబడులు పెట్టాలని, వొకేషనల్ ఎడ్యుకేషన్, స్కిల్ వర్క్ విషయంలో శిక్షణ అందించేందుకు సహకరించాలని సిఎం కోరారు. ఈ భేటీలో డ్యుయిష్ బోర్స్ ప్రతినిధులు అమిత దేశాయ్, డాక్టర్ క్రిస్టోఫ్ బోమ్, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిఎంతో అమెజాన్ వెబ్‌సర్వీస్ బృందం భేటీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అమెజాన్ వెబ్‌సర్వీస్ బృందం మంగళవారం భేటీఅయింది.

రాష్ట్రంలో అమెజాన్ వెబ్‌సర్వీస్ ఆన్ గోయింగ్ డేటా సెంటర్లు, వాటి విస్తరణపై చర్చించారు.

పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో అమెజాన్ వెబ్‌సర్వీస్ డేటా సెంటర్ గ్లోబల్ హెడ్ కెర్రీ పర్సన్, ఇన్‌ఫ్రా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ విక్రమ్ శ్రీధరన్,తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న గుత్తా, తదితరులు

శాసనమండలి పునర్‌నిర్మాణ పనులను పరిశీలించిన చైర్మన్

ప్రజాశక్తి -హైదరబాద్ బ్యూరో

తెలంగాణ శాసనసభ ప్రాంగణం, తెలంగాణ శాసనమండలి భవన పునర్‌నిర్మాణ పనులను చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మంగళవారం పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అతి త్వరలోనే శాసనమండలి భవన ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. శాసనసభ, మండలి కార్యదర్శి డా. నరసింహాచార్యులు, ఆర్అండ్‌బి, అగాఖాన్ సంస్థ, తదితర అధికారులతో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జరుగుతున్న పనులపై సమీక్ష నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ రాబోయే సమావేశాలు అసెంబ్లీ పక్కనే ఉన్న ఈ భవనంలోనే నిర్వహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని చెప్పారు. శాసనమండలి నూతన సమావేశ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అతిత్వరలోనే నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించినట్టు చెప్పారు. తాజాగా ఇప్పటి వరకు పూర్తయిన పనుల గురించి సిఎం ఆరా తీశారనీ, కచ్చితంగా శాసనమండలి సమావేశాలు పాతభవనంలోనే నిర్వహించాలని సిఎం ఆదేశించారని తెలిపారు. పనుల్లో ఎలాంటి జాప్యం చేయకుండా వేగం పెంచాలనీ, త్వరగా భవనాన్ని పూర్తిచేసి శాసనమండలి అధికారులకు అప్పగించాలని కాంట్రాక్టు సంస్థకు సూచించారు .

తాండూర్‌లో కర్ణాటక ఆర్‌టిసి బస్సును ఢీకొట్టిన లారీ

- కరీంనగర్‌లో ధాన్యం ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేవెళ్ల మండలం మీర్జాగూడ దగ్గర జరిగిన ఆర్‌టిసి బస్సు, టిప్పర్ ప్రమాదం మరువకముందే మంగళవారం మరో రెండు చోట్ల బస్సు ప్రమాదాలు జరిగాయి. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కరణ్‌కోట్ సమీపంలోని సాగర్ ఫ్యాక్టరీ వద్ద కర్నాటక ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. కరీంనగర్ జిల్లాల్లో ఆర్‌టిసి బస్సు ధాన్యం ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనల్లో పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

కర్నాటక రాష్ట్రం గుల్బర్గా నుంచి తాండూరు వైపు వస్తున్న ఆ రాష్ట్ర ఆర్‌టిసి బస్సును ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం ధ్వంసమైంది. బస్సులో ఉన్న ప్రయాణికులు క్షేమంగా బయటపడగా.. డ్రైవర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. అక్కడి నుంచి లారీ డ్రైవర్ పరారీ అయ్యాడు. తాండూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బస్సు

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలో తృటిలో పెను ప్రమాదం తప్పింది. మంగళవారం తెల్లవారుజామున మండలంలోని రేణికుంట గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద ధాన్యం బస్తాల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆర్‌టిసి బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలోని బస్సులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. మెట్‌పల్లి డిపోకి చెందిన బస్సు హైదరాబాద్ నుంచి మెట్‌పల్లి వెళ్తోంది. రేణికుంట శివారు దగ్గర ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ రోడ్డు కిందికి దూసుకెళ్లి బోల్తా పడింది.

ప్రమాదాన్ని గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ రవి కిందకు దూకి ప్రాణంతో బయటపడ్డాడు. సంఘటన స్థలాన్ని కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, సీఐ సదన్‌కుమార్, ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ పరిశీలించారు. ప్రమాద సమయంలో బస్సులో 31 మంది ప్రయాణిస్తున్నారని, వారిలో 15 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని 108లో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వేములపల్లి మండలంలో..

నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని అన్నపురెడ్డిగూడెం సమీపంలో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై బైక్‌ను డీసీఎం ఢీకొట్టింది. ప్రముఖ దినపత్రికలో పనిచేస్తున్న రేగూరి రాము మిర్యాలగూడ నుంచి వేములపల్లి వైపు బైకుపై వస్తుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న తమిళనాడుకు చెందిన డిసిఎం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రామును మిర్యాలగూడ ఏరియాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజాపూర్ జాతీయ రహదారి పనులను పూర్తి చేయాలి

- మీర్జాగూడ ప్రమాద బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్
- చేవెళ్ల ప్రధాన రహదారిపై సిపిఎం, ట్రాన్స్‌పోర్టు యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా



చేవేళ్ల ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పనులు వెంటనే ప్రారంభించి, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అప్ప జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మీర్జాగూడ వద్ద జరిగిన ప్రమాదం అందరి హృదయాలనూ కలచివేస్తోందని అన్నారు. బీజాపూర్ జాతీయ రహదారిపై పడిన గుంతలను వెంటనే పూడ్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్‌జిటిలో స్టే తొలగిపోయిందని ప్రకటించిందని, వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు. ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు అనాథలయ్యారని, ఆ పిల్లల సంరక్షణ పూర్తి బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలిందని అన్నారు. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గాయపడిన వారికి రూ.పది లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు స్పందించి అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లైన్ల రోడ్డు పూర్తి అయ్యేలా కృషి చేయాలన్నారు. లేని పక్షంలో ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీశ్, పార్టీ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్, అధ్యక్షులు శ్రీనివాస్, ట్రాన్స్‌పోర్టు యూనియన్ (సిఐటియు) అధ్యక్షకార్యదర్శులు రమేష్, నవాజ్, కోశాధికారి శ్రీశైలం, ఉపాధ్యక్షులు వెంకట్రాములు, నాయకులు మహేందర్, ఊరెళ్ళ రాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



దాశరథి జీవితం నేటి తరానికి ప్రేరణ

- డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి

ప్రజాశక్తి - కల్చరల్

రచనలతో పోరాట స్ఫూర్తి రగిలిస్తూ స్వయంగా నిజాం నవాబ్ వ్యతిరేక పోరాటంలో ఉద్యమించి జైలు శిక్ష కూడా అనుభవించిన దాశరథి జీవిత చరిత్ర నేటి వారికి ప్రేరణ ఇస్తుందని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి అన్నారు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో సాహిత్య అకాడమీ నిర్వాహణలో రాపోలు సుదర్శన్ రచించిన దాశరథి జీవిత చరిత్రను డాక్టర్ నరసింహా రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. పిల్లలకు అవగాహన కలిగించే విధంగా సులువైన పదాలతో సుదర్శన్ దాశరథి జీవితం పరిచయం చేశారని ప్రశంసించారు. ప్రముఖ జర్నలిస్ట్ టి ఉదయ వర్లు మాట్లాడుతూ దాశరథితో తనకున్న పరిచయం వివరించారు. దాశరథి వంటి మహనీయులు జీవితం మరుగు పడకుండా సుదర్శన్ చేసిన ప్రయత్నం అభినందనీయమన్నారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, దాశరథి అల్లుడు గౌరీ శంకర్ ప్రముఖ రచయిత ఎం నరహరి తదితరులు పాల్గొన్న సభకు డి కమలా రెడ్డి అధ్యక్షత వహించారు.



వైద్యుడి ఇంట్లోనే డ్రగ్స్ దందా

- ముషీరాబాద్‌లో డాక్టర్ జాన్‌పాల్ అరెస్ట్
- రూ.3 లక్షల మాదక ద్రవ్యాలు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ ముషీరాబాద్‌లోని ఓ వైద్యుడి ఇంట్లో డ్రగ్స్ వ్యాపారం సాగించడం కలకలం రేపింది. తన స్నేహితులతో కలిసి డాక్టర్ జాన్‌పాల్ డ్రగ్స్ దందా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ వృత్తిలో ఉన్న జాన్‌పాల్ ముగ్గురు స్నేహితులు ప్రమోద్, శరత్, సందీప్‌తో కలిసి ముషీరాబాద్‌లో డ్రగ్స్ దందా నడుపుతున్నాడు. ఢిల్లీ, బెంగళూరు నుంచి డ్రగ్స్ దిగుమతి చేసుకొని ముషీరాబాద్‌లో ఒక ఇంటిని అద్దెకి తీసుకొని ఈ దందాకు తెరలేపాడు. పక్కా సమాచారం అందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ఉదయం డాక్టర్ జాన్‌పాల్ ఇంటిపై దాడి చేసి అతన్ని అరెస్టు చేశారు. ఈ డ్రగ్స్ అమ్మకాలు తన ఇంటి నుంచి చేస్తునందుకు.. డ్రగ్స్‌ను ఉచితంగా వాడుకుంటున్నట్టు పోలీసుల విచారణలో డాక్టర్ తెలిపాడు. ఈ సోదాలలో 26.95 గ్రాముల ఓజీ కుష్, 6.21 గ్రాముల ఎండిఎంఎ, 15 ఎల్ఎస్‌డి బాస్ట్స్, 1.32 గ్రాముల కోకైన్, 5.80 గ్రాముల గుమ్మాస్, 0.008 గ్రాముల ఆసీస్ ఆయిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు దీని విలువ రూ.మూడు లక్షలకు పైగా ఉంటుంది. పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని, ఈ ఘటనపై లోతుగా దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పేదలందరికీ నాణ్యమైన ఉచిత బియ్యం అందాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి



తనిఖీలు నిర్వహిస్తున్న గోలి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి పేదోడికీ నాణ్యమైన ఉచిత బియ్యం పారదర్శకంగా అందించాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని రేషన్ దుకాణాన్ని, పట్టణ సమీపంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌తో పాటు రెడ్డిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాల ఉన్నత పాఠశాలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ కమిటీ సభ్యులు భూక్యా జ్యోతి ఇతర సభ్యులతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. రెడ్డిపల్లి గ్రామంలో ఉన్న ఉన్నత పాఠశాలలో నాణ్యత సరిగ్గా లేదని నిర్వాహకులకు నోటీసులు ఇచ్చి సంజాయిషీ ఇవ్వాలని డిఇవోను ఆదేశించారు.

భద్రత, నాణ్యత, ప్రారంభ నిల్వలు, ప్రభుత్వ పథకాల అమలు వంటివి పరిశీలించారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద రేషన్ డీలర్లకు న్యాయం జరిగేలా చూసుకోవడానికి రేషన్ బియ్యం బ్యాగుల లెక్కింపు ఆధారంగా కాకుండా కచ్చితమైన బరువు ఆధారంగా పంపిణీ చేయాలన్నారు. ప్రతి పేదోడికి కడుపు నింపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని సరఫరా చేస్తుందన్నారు. దీన్ని క్షేత్రస్థాయిలో ప్రతి ఒకరికి పారదర్శకంగా సరఫరా చేసే విషయంలో చిత్తశుద్ధితో వివరించాలన్నారు. ప్రతి రేషన్ షాపులో వస్తువుల నిల్వ పంపిణీ నమోదు పద్ధతులు, కార్డుదారులకు సరైన విధంగా సరుకులు అందిస్తున్నారా అని రేషన్ డీలర్లను అడిగి తెలుసుకున్నారు.

పిల్లల పౌష్టికారం నాణ్యత పరిశీలన

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అభివృద్ధి సేవల నాణ్యతను పరిశీలించారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్యక్రమం, విద్యా వసతులు, పిల్లల హాజరు, నిర్వహణను తనిఖీ చేసి.. అధికారులకు సూచనలు చేశారు. పిల్లలకు మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందించాలని, అందుకు జిల్లా అధికారులతో పాటు సంబంధిత శాఖల అధికారులు సమన్వయం ఉండేలా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిఇవో రాధాకృష్ణ, బీడబ్ల్యూఓ హేమా భార్గవి, సివిల్ సప్లయ్ అధికారి నిత్యానంద, నర్సాపూర్ ఆర్‌డిఒ మైపాల్ రెడ్డి, డిఆర్‌డిఎ పిడి శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులున్నారు.

నిధులు దారి మళ్లిస్తే చర్యలు తప్పవు

- సమగ్రశిక్షా ప్రాజెక్టు డైరెక్టర్ నవీన్ నికోలస్



సమావేశంలో మాట్లాడుతున్న నికోలస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిఎం శ్రీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను ఆమోదించిన పనులకే వినియోగించాలని సమగ్ర శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశించారు. సోమ, మంగళవారం రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోని ఆదివాసీ భవన్‌లో పిఎం శ్రీ, ఎస్ఎస్ఎ స్పర్శ్‌పై ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం మల్టీజోన్ 1లోని పిఎం శ్రీ 577 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్, రెండో రోజు మంగళవారం మల్టీజోన్-2లోని 462 పాఠశాలలు, గురుకులాల హెచ్ఎంలు, ప్రిన్సిపల్స్, డిస్ట్రిక్ట్ క్వాలిటీ కో-ఆర్డినేటర్స్, డైట్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్స్, ఎఫ్ఎ సిస్టం అనలిస్టులకు అవగాహన కల్పించారు. ప్రతి పనికి సంబంధించిన ఖర్చులను ఏ విధంగా ఉపయోగించాలనే విషయాలను సమగ్రంగా వారికి వివరించారు. 2025-26 సంవత్సరానికి ఆమోదించబడిన బడ్జెట్, ఆన్‌లైన్ బిల్లు సమర్పణపై శిక్షణ, స్పర్శ్, నాణ్యమైన విద్య, స్కూల్ గ్రాంట్, రవాణా సౌకర్యం, వృత్తి విద్య, సిడబ్ల్యూసిఎన్, అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్, జెండర్ అండ్ ఈక్విటీ, కమ్యూనిటీ మొబిలైజేషన్, సివిల్ వర్క్స్ అంశాలపై అవగాహన కల్పించారు. .

ఈ సందర్భంగా నవీన్ నికోలస్ మాట్లాడుతూ.. ఖర్చు చేసిన ప్రతి బిల్లును డిఇఒలకు సమర్పించాలని స్పష్టం చేశారు. ఈ పథకం అమలకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేశారు. అన్ని బిల్లులను స్పర్శ్, ఐఎఫ్ఎంఐఎస్ (ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్) పోర్టల్ ద్వారా ట్రెజరీకి సమర్పించాలని ఆదేశించారు. విక్రయదారులు, వెండర్లకు మాత్రమే బిల్లులు చెల్లించాలనీ, ఇతర వ్యక్తులకు నేరుగా బిల్లులు చెల్లించొద్దని తెలిపారు.

జెమ్ తదితర నిబంధనల ప్రకారమే కొనుగోళ్లు ఉండాలనీ, అనుమతి లేని ఖర్చులకు వాడినా, నిధులను దారి మళ్లించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పిఎం శ్రీ పాఠశాలలను గుర్తించి, ప్రోత్సాహకరంగా వారిని సన్మానించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్లు రాధా రెడ్డి , జాయింట్ డైరెక్టర్స్ పి.రాజీవ్, జాయింట్ డైరెక్టర్ వెంకట నరసమ్మ, ఫైనాన్స్ కంట్రోలర్ వెంకన్న, ఫైనాన్స్ అధికారులు, సంబంధిత కోఆర్డినేటర్లు, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

నాలాపై నిర్మించిన ప్రహరీ కూల్చివేత

- దేవరయంజాల్‌లో హైడ్రా అధికారుల చర్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు చర్యలు కొనసాగిస్తున్నారు. తాజాగా తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయంజాల్ ప్రాంతంలో నాలాపై నిర్మించిన ప్రహరీని కూల్చేశారు. నాలాను ఆక్రమించి వరద నీరు ప్రవాహానికి అడ్డంగా నిర్మించిన ప్రహరీ వల్ల ఇటీవల కురిసిన వర్షాలతో దేవరయంజాల్‌లోని మహాలక్ష్మి వెంచర్ సహా పలు కాలనీలు నీట మునిగాయి. దాంతో అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరగా.. వారు చూసీచూడనట్టు వ్యవహరించినట్టు ఆరోపణలు వచ్చాయి. అనంతరం బాధితులు హైడ్రాను ఆశ్రయించారు. దాంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు మంగళవారం తూముకుంట మున్సిపల్ అధికారులతో కలిసి నాలాపై అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. బద్దం మహేందర్‌రెడ్డి అనే వ్యక్తి నాలా కబ్జా చేసి ప్రహరీ నిర్మించినట్టు హైడ్రా అధికారులు గుర్తించారు. ఈ మేరకు సదరు కబ్జాదారుడిపై కేసు నమోదు చేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

ఫీజులు చెల్లించకుంటే సచివాలయ ముట్టడి

- జాజుల శ్రీనివాస్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుంటే వారం రోజుల్లో సచివాలయం ముట్టడిస్తామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం సిఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఫీజుల కోసం పోరు నడుపుతున్న కళాశాల యజమాన్యాలకు, విద్యార్థులకు మద్దతు తెలిపారు. బడా కాంట్రాక్టర్ల బిల్లులు ఆపి స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని సూచించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం చేయొద్దని కోరారు.

1,037 పంచాయతీ కార్యదర్శుల పదవీ కాలం పొడిగింపు

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న కార్యదర్శుల పదవి కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా మంగళవారం జిఒ నంబర్1592 జారీ చేశారు. 01.04.2025 నుంచి 31.03.2026 వరకు లేదా సాధారణ పోస్టులు భర్తీ అయ్యే వరకు ఏది ముందు అయితే అది వారికి వర్తిస్తుందని ఉత్తర్వులో పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ నిబంధనల మేరకు పదవి కాలం పొడిగించిన కార్యదర్శుల వేతనం చెల్లించడం జరుతుందని తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కాసాల గ్రామ శివారులో మంగళవారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాసాల గ్రామానికి చెందిన పాముల సురేష్ (30) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయం, కుటుంబ పోషణ కోసం సుమారు రూ.10లక్షల వరకు అప్పులు చేశారు. ఈ నేపథ్యంలో చేసిన అప్పులను తీర్చలేక మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో మంగళవారం గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.